# మీ సంబంధం మాకు నచ్చలేదు...



భమిడిపాటి రామగోపాలం

రాత్రి తొమ్మిదిన్నరై పోయింది, ఇంటికి వేరేసరికి. విశాలి తలుపుతీస్తూనే ‘బాగాజరిగిందిటుగా, సన్మానసభ?’ అంది.

‘ఆ. కాని అప్పుడే నీదాకా యెలా వొచ్చింది?’

‘మీరు చెప్పకపోతే తెలీదనుకున్నారా?’

‘ఎవరు చెప్పేరయితే?’

‘ఇంటివాళ్ళమ్మాయి, వరం! - పాటలు పాడిన అమ్మాయీ తనూక్లాసుమేట్పట....’

‘సరేలే-ఎవో ఉంటాయి, బీరకాయ పీచులు.’

కాళ్ళూ చేతులూ కడుక్కొని భోజనానికి కూచున్నాను. విశాలి ప్రసంగం మార్చ లేదు. కూరా పచ్చడీ నే నడగడానికి వో నిమిషం ముందుగానే ఒడ్డించేస్తూ నేను భోజనం సంగతి మాట్లాడకుండా జాగర్త పడింది.

‘అది కాదండీ, ఎన్నాళ్ళయింది-అత నీ వూరొచ్చి?’

‘అయిదు రోజులు దాటింది ఇవాళ్టికి.’

‘మకాం కూడా మన వీధిలోనేట? చెప్పేరే కారు.’

‘ఏదో అలా అయిపోయింది-ఇంతకీ నీ ఆతిథ్యం కనీసం నీ చేత్తో వో కప్పు కాఫీ అతనికి ప్రాప్తం లేదేమోలే!’

‘అయ్యో పాపం! అలా ఎందుకైపోవాలి?....అర్థమైన మొహాల్ని ఇంట్లో పెట్టి మేపినప్పుడీ మాట లెక్కడి కెళతాయండీ?”

‘అబ్బ, అలాక్కాదు విశాలా. అతను, వాళ్ళ స్కూలు తరపున ప్రతినిధిగా వొచ్చేడు. అన్ని జిల్లాల్లోని అన్ని హైస్కూళ్ళు తలో ప్రతినిధిని పంపేరు. భోజనాలూ, కాఫీలూ అన్నీ స్కూల్లోనే ఏర్పాటు చేసుకున్నారు. కాదని ఇంకో చోటికి వెళ్ళడం సంఘ గౌరవం కాదని ముందే కట్టుగిట్టం చేసుకున్నారుట. అసలు మకామే స్కూల్లో ఉండవలసింది. ఈ వూళ్ళో కొందరికి అతను నా ఫ్రెండని తెలిసి కథలూ, పాటలూ వాట్లగురించి ఏదో నాలుగు ముక్కలేనా మాట్లాడుకోడానికి కక్కడ వీలుండదని, ఈ వీధిలోనే ఆ ఖాళీ ఇంట్లో అతనొక్కడికీ మకాం ఏర్పాటు చేసేరు. అంతకన్నా మరేం లేదు."

‘సభలో మిమ్మల్ని కూడా పొగిడేరుట!’

‘పొగడ్డానికి నాలో ఏముంది?- ఇం- గొప్ప రచయితకి బాల్యమిత్రుడైనందుకు ఫలానావారి అదృష్టానికి మా అభినందనలుత అని ఏదో అన్నారు; సభల్లో అలా అనడం మామూలేగా!’

‘మీకు బాల్యమిత్రుడన్నారూ?’

‘అంతేగా మరి! ఇప్పుడు నాకు ముప్పయి మూడు వెళ్ళేయి. పదహారో ఏట, అతనికీ నాకూ మొట్టమొదట స్నేహం కలిసింది. ఆ వయస్సువేపు ఇప్పుడుచూస్తే బాల్యం లాగే కనిపిస్తోంది....’

‘మరి మనింటికొక్కసారి - పోనీ భోజనానిక్కాకపోతే ఊరికేనైనా తీసుకు రాలేదేం?’

‘చెప్పేనుగా, ఏదో అలా అయిపోయిందని!’

"ఇంకా వుందా, వాళ్ళ మీటింగు?"

"ఇవ్వాళ్టితో సరి."

"అయితే రేపు అతన్ని మనింటికి భోజనానికి పిలవండి."

"అబ్బో-ఏం చెప్మా!"

నేను కంచంలో చెయ్యి వదిలేసి, విశాలి వేపు ఎగతాళిగా చూస్తూ నవ్వేను.

"నా యిష్టం."

"అదిగాదు, అంత ఇంట్రెస్టు ఏమిటా నా ఫ్రెండుమీద అని!"



"ఇంట్రెస్టు ఉండదా!_అన్ని పుస్తకాలు రాసిన మనిషి. స్వయంగా మనింటి పక్కనే కేంప్ ఒచ్చి ఉన్నాడంటే. అందులోనూ మీకు బాల్యమిత్రుడంటే. ఓమారు దగ్గిరిసా చూడాలని-అతను మాట్లాడితే వినాలని. కుతూహలంగా ఉండదా!_మీ యింట్లో అన్నం ముట్టనని అతనేం శపథంచేసేడా?"

"అయ్యబాబోయ్-కోంవడకు. రేవతన్ని తీసుకొస్తాగా!"

● ● ●



వంటయిపోయింది.భోజనానికి లెమ్మని చెప్పడానికి నే వెళ్ళేసరికి మురళి ఎవరితోనో ఏదో పిట్టకథ చెబుతున్నాడు. ముగ్గురు శ్రోతల మధ్య అతని కంఠం ఉల్లాసంగా, ప్రముఖంగా వినబడుతోంది.

"ఏమి టేమిటి-నేను లేకుండా ఏదో చెప్పేస్తున్నావే" అన్నాను మళ్ళీ మొదలు పెట్టమని అడగడానికి యిష్టంలేక.

"ఆఁ ఏముందీ. మీ రింకా పెళ్ళిచేసుకోలేదేమని అడుగుతున్నారీయన. దానికి నా ఎడ్వెంచర్ ఒకటి చెబుతున్నాను...."

"ఎడ్వెంచరా?"

"ఆఁ, ఎడ్వెంచరే. పెళ్ళికూతుర్ని చూడ్డానికి వెళ్ళడం అనేది కుర్రాళ్ళకి అంతేగా."

"కాకేం. ఇప్పుడు మరీనూ. ఆడపిల్లలు కూడా ప్రశ్నలడిగేస్తున్నారుట; మీకు చదరంగం వొచ్చా, సైకిలు తొక్కడం వొచ్చా-ఆఫీసర్ ఎదురుబడి ప్రొమోషన్ అడగ్గలరా- అంటూనూ. అంతెందుకు. మొన్నీ మధ్య ఈ వూళ్ళోనే. వాళ్ళిల్లు మంచి బజార్లో అన్నమాట;- పెళ్ళికొడుకు ఏదో కొంత నాసిరకంగా కనిపిస్తేనూ. ఈ ట్రాఫిక్‌లో రోడ్డు దాటటానికి మీ కెంత సేపు పడుతుందని అడిగిందిట ఓ అమ్మాయి....!" అన్నాను.

అందరూ నవ్వారు.

"నాకు జరిగింది అలాటిది కాదులే. అయితే చాలా రోజులైందనుకో; అప్పటికింకా మొగపిల్లల్ని ప్రశ్నలడగడందాకా రాలేదు. నేనూ మా చిన్నక్కయ్యా కలిసి వెళ్ళేం. పిల్లని చూడ్డానికి. వాళ్ళసలు మా



బంధువులే. అయితే చాలా పీనాసివాళ్ళు వాళ్ళ ఫేమిలీహిస్టరీకూడా అంతమంచిదిగాదు. ఆ పిల్ల అక్కగా రొకావిడ భర్తతోపోట్లాడి పుట్టింటికి మకాం వొచ్చేసింది. ఇంకొకావిడ, ఎక్కడో ఉద్యోగం చేసుకుంటున్న భర్తగార్ని అవూరికి ట్రాన్స్ఫర్ చేయించింది. అందుకేదో కారణం వుంది, అవిడ కేరక్టర్ మంచిది గాదని చెప్పుకునేవారు. అదంతా ఇప్పుడు మన కెందుకులెండి—

"చెప్పేదేమిటంటే. మాకు మీ పిల్ల అక్కర్లేదు మొర్రో అంటున్నా కూడా లక్ష్యపెట్టలేదు వాళ్ళు. ఓసారి పిల్లని చూడకూడదా అని కబురూ....వాళ్ళ పిల్లని చూసీ చూడగానే మొహం తిరిగిపోయి బాబోయ్ నాకు కట్నంవొద్దు కానుకలూ ఒద్దు' ముండీ అప్పరసనిచ్చి పెళ్ళంటూ చెయ్యండి చాలు, అంటామని వాళ్ళ ఉద్దేశం!"

అని అందరి మొహాలవేపూ చూసేడు. మురళి. అందరూ చిరునవ్వులు విసిరి అతన్ని ప్రోత్సహించేరు.

"ఏదోమరి; కాకిపిల్ల కాక్కిముద్దూ."

"ఎవళ్ళ అశలు వాళ్ళవి."

"సరే వెళ్ళాం. మేం వెళ్ళేసరికి స్వాయంత్రం నాలుగైంది. పొద్దుట ఏ తొమ్మిదింటికో చేసేసి ఫ్లాస్కులో పోసేసిన బాపతు కాఫీ చెరో కప్పు ఇచ్చేరు. మేం ఒస్తామని రాసిన ఉత్తరం అందిననాడు చేసిన పకోడీలూ. అవి తింటేనే గాని పిల్లని చూపించం అన్నట్టు ఓ పట్టాన పిల్లని ఇవతలికే తీసుకురాలేదు_"

"పాపం ఏదో శక్తికొద్దీ ముస్తాబు చేస్తున్నారేమో" అన్నా డొక శ్రోత.



"అదీ.కాదోయ్. ఈ పకోడీలూ-కాఫీ అరగించిన మీదట-చావు రాలేదన్న ఆశ్చర్యంలో ఎలాంటి ఆకారం కళ్ళబడ్డా ప్రాణానికి హాయిగా తగిలి. సరే కానివ్వండి! అనకపోతారా అని" అన్నాడు రెండో ఆయన.



"సరే అదృష్టవశాత్తూ - పెళ్ళిచూపుల టిఫిన్ అంతా తినక్కర్లేదన్న అనవాయితీ ఒక టుందిగా. దానిమూలంగా మాకు డాక్టరు ఖర్చు తగ్గిందనుకోండి-ఆనక ఊడిపడ్డాది భామ వేషం! సరిగ్గా నాలుగ్గజాల దూరంలో కూచోబెట్టారు. అక్కణ్ణించే లక్షణాలన్నీ కనబడ్డాయి....చేతులకీ, మొహానికి సరిగ్గా అంగుళం పొడుగు రోమాలు!.... రామరామ! వేషం చూదామా అంటే ఇంట్లోఉన్నవాళ్ళందరివీ తలోటీ తొడిగేశారు. నెక్లెస్ ఒకరిదీ, గాజులు మరొకరిదీ చెవుల కమ్మ లింకొకరివీ, జెడలో నాగరం బహుశా పొరుగింటి వాళ్ళదీ. జాకెట్టూ చీరా సరే. వాళ్ళమ్మ పెళ్ళినాటి వనుకోండి - ఆ విగ్రహం చూడాల్సిందే. వర్ణించడం కష్టం...."

"పాపం ఎంతసేపు కూర్చున్నారో అలా ఆవిడ కెదురుగా ఆ దృశ్యంచూస్తూ!"

"ఎడ్వెంచర్ అని ఊరికే అన్నారామరి!"

"—సరే. అయింది కాదూ. మా చిన్నక్కయ్య సరసాలమారి. కాసేపు అదీఇదీ అడిగి యథాశక్తి ఏడిపించుకు తింది. కాస్తలో కాస్త ఎంటర్ టెయిన్ మెంటనుకోండి."

అందరూ కళ్ళూ చెవులూ అప్పచెప్పి వింటున్నారు. చెప్పవలసిన మాటలు నోట్లోనే ఉండిపోయి. నాకొంచెం కష్టంగానే ఉంది.

"ఇహ అప్పుడు పాటకచేరీ; నా సామి రంగ!" అన్నాడు మురళి; అసలు తతంగం అంతా ఇందులో ఉంది. చూస్కో. అన్నట్టు.

ఆ సంగతి గ్రహించిన వొకశ్రోత "చేతులారా చేసుకున్న పాపం; అనుభవించక తప్పుతుందా!- మిమ్మల్నెవరు అడగమన్నారు. పాటొచ్చా! - ఏదీ ఒకటి విందాం!- అంటూను!" అని గడుసుగా నవ్వుతున్నాడు.

"అబ్బెబ్బే- మావల్ల ఏం తప్పులేదు. కాకపోతే అది మా పూర్వులెవరో చేసుకున్న పాపం అయివుండాలి. అంతే- పాట మొదలుపెట్టకముందే- మా చిన్నక్కయ్యా నేనూ పోదాం అంటే పోదాం అని గిల్లుకున్నాం. మధ్యవర్తివేపు తిరిగి గొంతుక సవరించుకొనే లోపలే ఆ పిల్ల తల్లిగారు ఉండే. మా తప్పిపోయిన అత్తగారు— "అమ్మాయికి పాటకూడా వచ్చు." అంది మొహం చేటంత చేసుకుని. అక్కడికీ మా చిన్నక్కయ్య తెంచేసి "వస్తే ఏం లెండి; మరోసారి వినొచ్చు." అనేసి సహం లేచింది. ఇంతట్లో మళ్ళీ అందుకుని "మరోసారి విందురుగాని. ఎప్పుడు వింటే మాత్రం ఈ సొంపొస్తుందా!" అని ఆతల్లి బలవంతాన ఆర్మణీపెట్టి తెచ్చి కూతురు ముందర కుదేసి; "సిగ్గుపడకమ్మా. ఒక్కటేదేనా పాడు" అని బెత్తాయించింది...."

"పాపం!" అన్నాడొక శ్రోత.

"—ఇహ ఎత్తుకుందండీ ఆలమాలు. అది హిందీ పాటో, మరాటీయో, లేకపోతే నేపాలీ భాషో తెలీదు. సిరి రామచెంద్ర కృపాళు భజమన హరణ భవ భయ దారుణం - ఆ ముక్కలు మాత్రం అలా జ్ఞాపకం ఉండిపోయాయి. ఇప్పటికీ జ్ఞాపకం— దారుణం, దారుణం!"

"నిజంగా దారుణమేనండీ" అన్నా డొక శ్రోత.

"అసలది మంచి కీర్తనేనండీ – మొదట్నుంచీ మా ఫ్రెండుకి హిందూస్తానీ సంగీతం అన్నా హిందీ కీర్తనలన్నా నచ్చవు ....కవి, స్వార్థపరుడు కదా! అవి తెలుగే అయివుండాలి; తనే వ్రాసుంటే ఇంకా మంచిది!" అన్నాను నేను.

"ఇది మరీ బాగుందోయ్. నేను రాసిన పాటలు నా పెళ్ళిచూపులకే ఎవరు పాడగలరు?'

"అదేమంత అసాధ్యమా? ఇప్పటికీ నీకు పెళ్ళికాలేదు. నువ్వు రాసిన పాటలు దాదాపు పాతిక ముప్ఫయి వరకూ దేశంలో మంచి ప్రచారంలో ఉన్నాయి. ఇవాళ నీ పాటలు రాని ఆడపిల్లలు లేనేలేరని నువ్వు అనలేవు. మాటవరసకి నిన్నరాత్రి గోవిందరావు గారమ్మాయి....అన్నీ నీ పాటలే పాడింది కద!"

"అయితే మాత్రం-మనం ఆ దృష్టితో?" అన్నాడు మురళి కంగారుగా.

"—అయింది కద! పవోజ్ గోవిందరావుగారు ఇవాళ సాయంకాలం విన్ను టీకి ఇన్వయిట్ చేసినట్టే చేసి-అయ్యా, మీ కింకా పెళ్ళికాలేదని విన్నాను. మరి మా అమ్మాయిని చూసేరు కదా! మీ అభిప్రాయం ఏమిటని అడిగేరనుకో-"ఏమోనండీ - ఆ దృష్టితో చూడలేదు" అంటావా? నన్నడిగితే-ఈ పెళ్ళిచూపులనే సిస్టమ్‌లోనే ఏదో మిస్టరీ ఉంది. ఎక్కువమంది ప్రిజుడిస్ అయిపోతున్నారు. ఏదో బావుందని పెళ్ళి అన్నీ బావున్నాయనుకొని తీర్మానించుకోడం, లేకపోతే ఏదో నచ్చలేదనుకొని అన్నిటికీ వంకలు పెట్టుకోడం - పది నిముషాలు మొదలు అరగంట వరకూ జరిగే యీ తతంగంలో. ఆ మధ్య, నిజం తెలుసుకొందుకు అవకాశం చాలా తక్కువ!" అన్నాను.

"అదీ నిజమే లెండి." అన్నాడొక శ్రోత లేని నవ్వుతెచ్చుకుంటూ.

"మొత్తానికి అలా ముగిసిందన్నమాట, మీ ఎడ్వెంచర్!" అని రెండో ఆయన నవ్వాడు.

మూడో ఆయన ఏదీ అనకముందే నేను మురళి వీపుమీద తట్టి "మరే. చెప్ప మరిచాను! – వంటయిపోయింది. భోంచేసొద్దాం పద." అన్నాను.

'ఓ. ఎస్. అయామ్ రెడి."

● ● ●

భోజనాలయిపోయి ఇవతల పడ్డాం.

"ఏమిటో నువ్వు సరిగ్గా సహజంగా భోంచేసినట్టు లేదు." అన్నాను.

"అబ్బెబ్బే లేదు— నాకు మీ యింట్లో మొహమాటమా?"

"మొహమాటం అనిగాదు. ఏదో పరధ్యానంగా ఉన్నావు" అన్నాను. అతను భోంచేస్తున్నంతసేపు కూడా అంతే. మాటలు సమయోచితంగా రాలేదు. ఒకదాని కొకటి చెప్పడం, మళ్ళీ అది సద్దుకుందికి ఇంకోటేదో చెప్పడం— ఇలా అయింది.

మేం విజయనగరంలో చదువుకున్నాం. కృష్ణమూర్తి హోటల్లో భోంచేసి, పక్కనే ఉన్న పంతులుగారి కిళ్ళీకొట్లో ఉప్పుచెక్క. ఏలక్కాయ కిళ్ళీ వేసుకోడం ఆనాటి జీవిత మాధుర్యాలలో ఒకటి. దొరకాలేగాని ఉప్పు చెక్క మజా ఎప్పటికీ నాకు చాలా అనుభవనీయంగా ఉండిపోతుంది. ఈ వూళ్ళో దొరకవుగాని, మొన్నిమధ్య వెంకట్రాజు





"ఇవే కక్కడ సంపాదించావోయ్" అంటూ మురళి సర్వం మరిచి తాంబూల చర్వణంలో పడ్డాడు.

ఆ నిషా దిగిపోకుండానే అందుకున్నాడు. "నీ పెళ్ళయి ఎన్నాళ్ళయిందీ?"

"అఁ, కాన్నాళ్ళయింది. ఐదారేళ్ళయింది."

"అత్తారేవూరు?"

"పిఠాపురం. సుబ్బరామయ్య గారని, ఎస్టేట్లో దివాన్‌గా ఉండే వారు మా మామగారు!"

తక్కువ మని ముందుకి వంగాడు మురళి. చిన్నదగ్గు దగ్గాడు.

"దిక్కెట్టిందా? ఈ ఉప్పు చెక్క అలవాట్లేక పోతే ఇంతే. అలాగే ఉండు. మంచినీళ్ళు తెస్తాను!" అని వంటింట్లో కెళ్ళాను.

గ్లాసులు ఖాళీ లేవు. అయిదు గ్లాసులు పాయసం తోనూ నీళ్ళతోనూ మా కంచాల

గజపతి నగరం వెళితే అతవిన్వారా దగ్గర ఎంగిలివి ఉండిపోయేయి. విశాల

తెప్పించినవి కొద్దిగా ఉన్నాయి. మూడు గ్లాసులు తన భోజనం దగ్గర

పెట్టేసుకుంది. చేసేదిలేక నా పీటదగ్గర మంచినీళ్ళ గ్లాసుతీసి, వరండాలో కెళ్ళి కడుక్కొచ్చి, బిందెలో ముంచాను.

''ఏమి టంటున్నాడు మీ ఫ్రెండు ?'' అంది విశాల.

''అబ్బే ! ఏం లేదు. నీ గురించే భోగట్టా చేస్తున్నాడు. ఏ వూరు, ఏం కథా అంటూను' ఇంతల్లో ఉప్పుచెక్క గొంతుక్కి అడ్డం పడినట్టుంది'' అని చిలిపిగా నవ్వేసి, నీళ్ళు పట్టుకొని హాల్లోకొచ్చేను.

మురళి, హాల్లో ఫోటోలవేపు చూస్తు న్నాడు. మా పెళ్ళి ఫోటో ఒక మంచి ఎన్లార్జిమెంటు. దాని కిటూ అటూ నాదీ విశాలిదీ పెద్ద పెద్ద బస్ట్ ఫోటోలూ, అన్ని ట్లోకీ ఈ మూడే ఆకర్షణీయంగా ఉంటాయి! వాటివేపే చూస్తున్నా డతను.

'పిఠాపురంలో ఇంత మంచి ఫోటోగ్రా ఫర్లున్నారటోయ్ ?' అని పలకరించాడు మురళి: తను ఇంతసేపూ ఫొటోగ్రఫినే పరిశీలించి చూస్తున్నాడని నే ననుకోవాలని కాబోలు.

"మంచినీళ్ళు తాగు." అన్నాను; సమా ధానం చెప్పకుండా.

"అక్కర్లేదు; నువ్వలా వెళ్ళగానే పర్ర కుంది.'' అంటూనే నీళ్ళు తాగేశాడు; చిరు నవ్వు తెచ్చుకుంటూ.

అతను ఇందాక హఠాత్తుగా వొంగి, దగ్గడం ఎందుకో, ఇప్పుడు నీళ్ళు తాగుతూ నవ్వడం ఎందుకో, నాకు తెలుస్తున్నట్టుంది.

అతను ఇంకా నవ్వుతూనే ;' — అది సరేకాని, వీళ్ళకి నువ్వెలా చిక్కేడావు ?' అన్నాడు.

అంటే ? – వీళ్ళు నీ కెలా తగులు కున్నారు–అనా ? 'పాపం. మోసపోయావు మిత్రమా ! అన్న ఖాలి ధ్వనించింది.

నాకు తెలిసిపోయింది. నా మిత్రుడు ఎడ్వెంచర్ చేసిన పెళ్ళి చూపుల్లోని కన్య ప్రస్తుతం మా 'విశాలి'గా, మా యింట్లో ఉంది !

దారుణం, దారుణం !

● ● ●

''సారీ ! ఇలా అవుతుందనుకో లేదోయ్'' అన్నాడు మురళి.

''అరె ! నువ్వలా ఎందుకంటున్నావో నా కర్థం కావడం లేదు. అందులో ఎవరైనా విచారించవలసింది ఏముంది అసలు ?'' అన్నాను.

ఓ నిముషం పూరుకొని ''నేనేం అన్నానో నాకు గుర్తు రావడంలేదు....'' అని తడుముకోసాగాడు మురళి.

ఇందాక ఆ సిగ్గుమాలిన ఉపాఖ్యాన క్రమంలో, తను పొరపాటున ఏదైనా అనరాని మాట అన్నాడా అని అతనిప్పుడు బాధ పడుతున్నట్టుంది.

''నాకూ గుర్తులేదు....'' అని నవ్వేసి ''గనక నువ్వేదీ గుర్తు తెచ్చుకోడం మంచిది గాదని నా ఉద్దేశం !....'' అన్నాను.

మళ్ళీ కాసేపు ఆగాడు మురళి. ''–ఎటా ఆల్. కొంత విచారించ వలసింది కూడా ఉందేమో అని'' అన్నాడు.

''నా కలా అనిపించడం లేదు.''

''బాగా కట్నం ఇచ్చేరా ?''

''నథింగ్ డూయింగ్.''



''మరి ఎలా జరిగింది ? ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది !''

''నేను పొరపాటనుకో లేదన్నానుగా !''

''ఆ విషయంలో నిన్ను నే నభినందించక తప్పదు.''

''నేనుకూడా నన్ను చాలాసార్లు అభినందించుకున్నాను–ఈ విషయంలో.''

''ఆఫ్ కోర్స్, కొంతమంది జీవితంలో ఏ దెలా దొరికితే ఆలా తీసుకుని ఆనందించ గలుగుతారు....అదృష్టవంతులు.''

నేను నవ్వాను. 'అలాక్కూడా అవ లేదు .... .... నువ్వు తెలుసుకోజూడ్డం నాకు చాలా సంతోషంగా ఉంది.... నే నామెని చాలా పరీక్షలకి గురిచేసేను. అన్ని టికీ నిలబడిందని నీకు చెప్పడానికి గర్విస్తు న్నాను.'

మురళి మాట్లాడలేదు.

చాలా సున్నితమైన విషయం. విచిత్ర మైన సంఘటన. ఇన్ని సంవత్సరాల తర వాత వాళ్ళ గురించి తన కప్పుడేర్పడిన భావం చెప్పడం పెద్దమనిషితరహా కాదు. మిత్రు డింటికి వెళ్ళి మిత్రుడి భార్యమీదా అత్తారిమీదా అభాండాలు వెయ్యడం నాగరి కతా కాదు. మిత్రుడి శ్రేయస్సు కోరి అతని చుట్టూ ఏదేనా కీడు వున్నప్పుడు చెప్పగోరడం సహజం. అన్నిటికీ మించి పొద్దుటే తను చేసిన వ్యాఖ్యానాలు సమర్థిం చుకోవడం బహుశా అవసరమేమో; ప్రఖ్యాతిగల మనిషికి, అన్న మాట నిలబెట్టు కోడమే ముఖ్యావసరం కద !

అతని స్థితి అర్థం చేసుకోడానికి ప్రయ త్నిస్తూ నేనూ మాట్లాడలేదు.

నేను బి. కెక్. అయిన తర్వాత, ఎవరో పిఠాపురం షుగర్ ఫేక్టరీలో వేయిం చేరు, నా కుద్యోగం. వీళ్ళ యింటికి ఎదు రుగా ఉండేవాణ్ణి. ఆ యింట్లో ఒక సంగీత విద్వాంసురాలు ఉండేది; ఆమె శిష్యురా లీమె. హిందూస్థానీ సంగీతమే ఈమె అభ్యసించేది. కర్ణాటకం అంతకుముందే కొద్దిగా వచ్చునుట. అంతకంటె హిందూ స్థానీ సంగీతమే తన కిష్టమట. సూర్ దాస్, భక్త మీరా, కబీర్ భజన్లు, టుమ్రీలు, ఇంకా కొద్దిగా – పారశీక కవులు రచించిన ఘజల్లు, నేర్చుకుంది. మరీ మరీ పాడించి వినిపించేది, ఆ టీచరు.

నిష్దిన్ బర్సత్ నైన్ హమారే. జబోరే మన్ రామ్నామ్ సుఖ్దాయీ. తోతుమ్ తోడో పియా. చలో మన్ గంగా జమునా తీర్. కోయీ కహియోరె. ఇలా టివి కొన్ని. లాస్ట్ బట్ నాట్ లీస్ట్– శ్రీరామచంద్ర కృపాళ్ భజమన్ హరణ– నాకు కూడా పట్టుబడ్డాయి ......అద్భుతంగా పాడుతుంది విశాలి.

అన్నీ చెప్పాను మురళికి.... 'పెళ్ళై పోయిన వెంటనే సంగీతం మరిచిపోకుండా, సాధన చేసి, కృషి చేసి, మంచి అనుభవం సంపాదించింది...... నువ్వు చెప్పిన రోమాలూ, ఆ అనాకారితనం– అవన్నీ నీ బేడ్ ఇమాజినేషనో, లేక మీ చిన్న క్కయ్య ప్రభావమో అయివుండవచ్చు. ద్వేషించడంలో ఒకరి సహాయం చాలా సుళువుగా అంగీకరిస్తాం....... ఏదెలా వున్నా, నువ్వు అరగంటసేపు చూసి నిర్ణ యించుకున్నావు; నేను ఆరునెల్ల కాలం చూసి నిర్ణయించుకున్నాను ......' అని కూడా చెప్పేను.

'వాళ్ళు చాలా పీనాసివాళ్ళోయ్."

'నాకు వాళ్ళ డబ్బు కావలసొస్తేకద. ఆ సంగతి నన్ను బాధించడం!'

విశాలిచేత ఓ కచేరీ చేయించితే. 'చాలా బావుంది; అనాడు నేనే పొరపాటు పడ్డాను.' అంటాడు మురళి. ఇప్పుడు. కాని అది నాకు అనవసరం.... అదలా వుంచి. నే నామెని పెళ్ళాడ్డం వల్ల కొంతైనా నష్టపోయానని- కనీసం యింతకన్నా అభివృద్ధిలోకొచ్చే ఛాన్సులు పోగొట్టుకున్నానని చెప్పడానికి కొంచెంసేపు తాపత్రయపడ్డాను; మురళి. అతనికి నామీదున్న ప్రేమవల్లో. లేక మరేదైనా కారణం వుందో—

"పెళ్ళేదా మీ ఫ్రెండు?"

"ఆఁ. నిన్ను చాలా థేంక్స్ చేసేనని చెప్పమన్నాడు. వంటలు చాలా బావున్నాయట" అని నవ్వాను.

"ఈమాత్రంవానికి మీతోటి చెప్పించడం ఒకటా. మొహం ఎదట థాంక్సయినా చెప్పలేడా? మళ్ళీ అంత గొప్పవాడు!"

"చెప్పలేక పోడానికో కారణం వుందిలే."

"ఏమిటో?"

"నీకు తెలీదా-విశాలా?"

"నా కెలా తెలుస్తుందండీ?"

"సువ్రతన్ని గుర్తుపట్టలేదా?"

"ఏమో-ఎక్కడో ఓసారి చూసినట్టుంది."

"ఎక్కడో సువ్రతన్ని చూడ్డం కాదు. మీ ఇంట్లోనే. పెళ్ళిచూపుల కొచ్చేడు-మీకు దూరపు బంధువేనట!....వెంకట నరసయ్యగారని. వీళ్ళ నాన్నగారు రాజమండ్రిలో లాయరు...."

"ఆఁ. అతనా - ఇతను? అరెరె!" అంటూ విశాల కుర్చీలోంచి సగం లేచింది. "వెళ్ళిపోయాడా-ఇంకా ఉన్నాడా?"

"వెళ్ళిపోయాడు బండెక్కించి కదా వచ్చేను!"

"అర్రెరె. ఎంతపని జరిగిపోయిందండీ, నాలుగూ మొహాన దులిపేసేదాన్ని కదా, మీరైనా చెప్పేరు కారేమండీ?"

"నాకైనా ముందుగా తెలీదు. లోంచేని లేచేక కొన్నిసంగతులు ఆరాతీసి మరీ చెప్పేడు."

అని అతను పొద్దుట కాకతాళీయంగా వాళ్ళపెళ్ళిచూపుల వృత్తాంతం చెప్పడం గురించి తెలియజేశాను

"-ఔనౌను! అవేళ. ఇతనూ. వీళ్ళక్కగారూ వచ్చేరు. నన్ను పాటపాడమని, హిందీ బోధపడక నేను సినిమాపాట పాడలేదని వేళాకోళం చేసేరు. సంసారంలోదో- పాతాళభైరవిలోదో పాడమని. కూడా వొచ్చిన మధ్యవర్తి సలహాయిచ్చేడు.... వీళ్ళక్కగారూ లేదూ. ఆవిడ ఎన్ని షోకులు పోయిందనుకున్నారు! భజన పాటలేనా, తత్వాలూ అవీ వొచ్చా అంది. "పాట మ్యూజికం దివ్యంగావుంది. ఈ పాటికి గ్రామఫోన్లు కొనడం మానెయ్యొచ్చు.' అంటూ ఏమిటేమిటో వాగింది...."

"వీళ్ళింటో జరిగినన్ని ఘోరాలు మా బంధువుల్లో ఎక్కడా ఎరగం. పెద్ద కోడల్ని - బయటుంటే తాటాకుపాకలో పడుకోబెట్టి అర్ధరాత్రిపూట నిప్పుపెట్టేశారు. ఆ మానవుడికి మళ్ళీ ఎవరూ పిల్లనివ్వలేదు. ఇప్పటికీ అలా సన్యాసి బ్రతుకే అఘోరిస్తున్నాడు. రెండో కోడలు వీళ్ళ బాధ భరించలేక కిరసనాయిలు పోసుకొని అంటించేసుకుంది. స్టవ్ పేలిందని కమ్మేశున్నారు. మెడ్రాస్‌లో పనిచేస్తూ ఎవరో ఒక అరవామెని రెండో పెళ్ళి చేసుకున్నాడు....ఆ తరవాత వాళ్ళింటికి పిల్లనిస్తాం అంటూ బంధువుల్లోగాని. తెలిసిన వాళ్ళలోగాని ఎవరైనా వెళ్ళగా ఎవరూ చూడలేదు. వినలేదు.... చూతరాదూ. అయ్యా! ఇప్పటికీ ఘోటక బ్రహ్మచారిగా ఉన్నాడు. మీ కంటే ఓ యాడాది పెద్దేమో మళ్ళీను! అంతా అదపెత్తనం. మంగలి బాజా... మళ్ళీ అందరికీ వొంకలు పెట్టడమే!

'నాకు "దారుణం" అని నిక్‌నేమ్ పెట్టేరండీ; వీళ్ళక్కయ్యా ఇతనూ కలిసి! నే నా రోజున పాడిన కీర్తనలో - దారుణం - అని ఓ ముక్క వొచ్చిందట; ఆ పేరు బంధువుల్లో ప్రచారం చేసేరు. నేను సంగీతాన్ని ఖూనీ చేస్తున్నానుట; దారుణంగానుట!- అయ్యయ్యో. ఎంత పని జరిగిపోయిందండీ ఛాన్సుపోయింది!—'

'ఏమిటది?'

'ఇతనికి సన్మానం చేస్తారంటూ నాలుగు రోజులనాడు గోవిందరావుగా రమ్మాయి ఇతను రాసిన పాటలు పట్టుకొచ్చి వరసలు కట్టమంది. చాలా బావున్నాయని మెచ్చుకున్నాట్టగా. సభలో! - వదిని మిషాలు ముందుగా చెప్పేరుకాదు. ఆయనే యీయనని!- తేల్చి పారేద్దును; సంగీతాన్ని ఖూనీ చేస్తున్నానో ఇంకేం చేస్తున్నానో!'

'నువ్వా. ఆ వరసలు కట్టింది; నాతో చెప్పనేలేదే!'

'ఏం పెద్ద చెప్పేదుండి? - అరెరె; చెయ్యిదాటి పోయిందండి!'

"ఏమీ దాటిపోలేదు - గోవిందరావుగారు ఆ అమ్మాయిని అతనికిచ్చి పెళ్ళి చేస్తారుట; అప్పుడెలాగా నిన్ను పిలుస్తారు; అప్పుడు చెబుదువుగాని!'

విశాలి నా జోక్‌కి నవ్వలేదు.......

"ఛీ ఛీ - యితనికా? ఎత్తెత్తి కాలు ఎంగిలాకుమీద వేసినట్టు ఇతని కివ్వడమేమిటండీ. బంగారంలాంటి పిల్లని!"

"అబ్బబ్బా. ఇది బాగులేదు విశాలా. మీరిద్దరూ వొకర్నొకరు చిన్నపిల్లల కంటె సిల్లీగా ద్వేషించుకుంటున్నారు; అలగా జనం కంటె దారుణంగా దూషించుకుంటున్నారు. మీరే ఒకర్నొకరు పెళ్ళాడితే ఇద్దరూ ఇద్దరి తప్పుల్ని క్షమించి-"

"ఛీ! నేనా?"

"అబ్బే. అలాకాదు. అనుకోడానికేం- పెళ్ళి చూపులదాకా వచ్చింది కదా. పెళ్ళి చేసుకున్నారే. అనుకో. ఇలా మాట్లాడుతారా. ఒకర్ని గురించొకరు?"

"ఏమో; నేనతన్ని పెళ్ళాడి ఉండేదాన్ని కాదు!"

"అది ఇప్పటి మాట! - వాళ్ళ దౌష్ట్యాన్ని ఎత్తిపొడుస్తున్న నీకు. వాటికి కారణాలు కూడా తెలిసుండేవి; అప్పుడు -"

"ఛీ ఛీ - వాళ్ళందరూ........" విశాలి పళ్ళు బిగించింది.

"ఆ మాత్రం అతను కూడా అన్నాడులే. మీరు పీనాసి వాళ్ళుట; మీ పెద్దక్క అలాగట; చిన్నక్క ఇలాగట! - ఇలా చెప్పుకుంటూ పోతే కాలం చాలదు! - మీరిద్దరూ నాకు కావాల్సిన వాళ్ళే. అయితే నేనెవర్ని సమర్థించడం?"

"నిజమైన విలువ ఎవరిదైతే వార్ని!"

"నిజమైన విలువ యిద్దర్లోనూ ఉంది- అదంతా ఇప్పుడెందుకుగానీ. ఏదీ ఎక్కసారి ఆ కీర్తన-దారుణం!"

"మీరు మీ ఫ్రెండూ ఎగతాళి చేస్తే మాత్రం ఆ కీర్తన విలువ మాసిపోతుందనుకుంటున్నారా? దానికేమండీ. రత్నంలాటి కీర్తన! శబ్దం. అర్థంకూడా మంచివి!" అని లేచింది విశాల.

శ్రీ రామచంద్ర కృపాళ్ భజమన్
హరణ భవభయ దారణం
నవకంజలోచన కంజ మృగకర
కంజపద కంజాననం

అని మెల్లగా- కమ్మగా గానం చేస్తూ విశాలి ఇంట్లో ఏదో పని చూసుకోసాగింది.

□□□